సాక్షి
అనకాపల్లి

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



జూలో సందడి

విశాఖ: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శనివారం పిల్లలకు వన్యప్రాణుల వేషధారణతో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు.



సందడిగా అంతరిక్ష వేడుకలు

విశాఖ: రఘు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ అంతరిక్ష వేడుకలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



కళాకారుడికి సత్కారం

విశాఖ: బంగారు నంది అవార్డు గ్రహీత బగాది విజయసారథిని మురళీనగర్‌లోని వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు.



• అలరించిన నృత్య ప్రదర్శన

చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో శనివారం నాట్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. విశాఖకు చెందిన నిర్మల నృత్య నికేతన్ విద్యార్థుల ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈవో సత్యనారాయణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఉప్పల సతీష్, పాల్గొన్నారు. -చోడవరం



• చెస్‌లో చిచ్చరపిడుగు

జాతీయ అండర్-11 చదరంగం చాంపియన్‌షిప్‌లో ఎస్.రాయవరానికి చెందిన బాలిక భీమరశెట్టి శ్రావ్యశ్రీ 8వ స్థానం సాధించింది. ఈనెల 1 నుంచి విశాఖలో జరుగుతున్న పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం -8లో

న్యూస్‌రీల్

కేజీహెచ్‌లో రోగుల కోసం 20 బెంచీలు



రోగుల సౌకర్యార్థం సాగర్ సిమెంట్ పరిశ్రమ విశాఖ కేజీహెచ్‌కు సమకూర్చిన బెంచీలు

కశింకోట: విశాఖ కేజీహెచ్‌లో రోగులకోసం మండలంలోని బయ్యవరం సాగర్ సిమెంట్ పరిశ్రమ యాజయాన్యం 20 బెంచీలను సమకూర్చింది. ఇందుకు పరిశ్రమ తరఫున సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.50 లక్షలు ఖర్చు చేసినట్టు సీనియర్ మేనేజర్ పి.వి.పాండురంగారావు తెలిపారు. 60 మంది కూర్చోడానికి సరిపడిన బెంచీలను కేజీహెచ్ సూపరింటెండెంట్ రాజుకు అందజేసినట్టు చెప్పారు.

నేడు మర్రివలసలో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

కె.కోటపాడు: మర్రివలసలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ భవనాలతో పాటు జల్‌జీవన్ మిషన్ నిధులతో ఏర్పాటుచేసిన ఇంటింటి కుళాయిల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం జరగనున్నట్టు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ బీ.వి. సత్యవతి హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

నేటి నుంచి ఇంటర్ సర్టిఫికెట్ల పంపిణీ

విశాఖ విద్య: ఇంటర్ పరీక్షల్లో పాసైన విద్యార్థులకు ఆదివారం నుంచి ఒరిజనల్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆర్ఐవో రాయల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి, మే నెలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజనల్ పాస్ మెమోలు విశాఖలోని పిఠాపురం కాలనీలో గల ఆర్ఐవో కార్యాలయానికి వచ్చాయన్నారు. వీటిని తీసుకునేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాల్స్ ఆదివారం ఉదయం 10 గంటలకు రావాలన్నారు. ఉత్తీర్ణత ధృవీకరణ పత్రాలను ఇక నుంచి డిజిలాకర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులందరితో వారి మొబైల్ ఫోన్లలో డిజిలాకర్ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. దీనిపై ప్రిన్సిపాల్స్‌కు ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు.

నేడు విశాఖకు మంత్రుల రాక

మహారాణిపేట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం విశాఖ రానున్నారు. మంత్రి రాజన్నదొర సాలూరు నుంచి రోడ్డు మార్గంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని, రాత్రి 11గంటలకు రైల్లో విజయవాడ వెళ్లనున్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మధ్యాహ్నం 3.30 గంటలకు సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని, సాయంత్రం 4.35 గంటలకు విమానంలో విజయవాడ వెళ్తారు.

ఇంటింటా ఆరోగ్యం

- వెల్లువలా వస్తున్న జనం
- తొలి ఆరు రోజుల్లో 45,100 మందికి వైద్యసేవలు
- పెద్దాసుపత్రికి రిఫర్ చేసిన రోగుల సంఖ్య 1280



గన్నవరంలో రోగి ఎక్స్‌రేను పరిశీలిస్తున్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ మల్లికార్జున్



నాతవరం మండలం గునుపుడి పీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

సాక్షి, అనకాపల్లి: స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా 24 మండలాల్లో ప్రతి రోజూ ఏదో ఒక సచివాలయ పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య శాఖ షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలను జోరుగా నిర్వహిస్తోంది. శిబిరాల్లో ప్రజలు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా స్పెషలిస్ట్ వైద్యుల సేవలను పొందుతున్నారు. డాక్టర్లు సూచించిన మందులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలను గుర్తించి పరిష్కరించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సెప్టెంబర్ 30న ప్రారంభించిన విషయం తెలిసిందే. శనివారం ఆరో రోజు కూడా సురక్షకు రోగులు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఆరు రోజుల్లో 45,100 మంది

ప్రభుత్వ సెలవు దినాలను మినహాయిస్తే శనివారం వరకు ఆరు రోజుల పాటు వైద్య శాఖ 144 శిబిరాలను నిర్వహించింది. ప్రతి శిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లతోపాటు గైనిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ఆప్తాల్మాలజీ తదితర స్పెషాలిటీ విభాగాల నుంచి నిపుణులు పాల్గొంటున్నారు. వీరిలో కనీసం నలుగురు వైద్యులు అందుబాటులో ఉంటారు. ఆరు రోజుల్లో ఏకంగా 45,100 మంది సొంత ఊళ్లలో ఉచిత చికిత్సలు పొందారు. వీరిలో 20 వేల మంది వరకు మహిళలున్నారు. మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు భావించిన 1280 మందిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు.

ఉచితంగా పరీక్షలు, మందులు

ప్రతి క్యాంపులో 14 రకాల వైద్య పరీక్షలతోపాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అవసరం మేరకు కంటి పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు, ఫుడ్ సప్లిమెంటేషన్ మ్యాపింగ్ చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఫ్యామిలీ డాక్టర్లు, ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) పర్యవేక్షిస్తున్నారు. ఐదు దశల్లో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

టోకెన్లు లేకున్నా వైద్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటినీ ఏఎన్ఎం, సీహెచ్‌వోలు సందర్శించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలున్న వారికి టోకెన్లు జారీ చేస్తున్నారు. టోకెన్లు లేకున్నా కూడా తమ గ్రామం/పట్టణంలో శిబిరం నిర్వహించే ప్రాంతానికి నేరుగా వెళ్లి వైద్య సేవలు పొందవచ్చు. ఈ శిబిరాలకు సాధారణ వ్యాధిగ్రస్తులే ఎక్కువగా వస్తున్నారు. వీరిలో మేజర్ వ్యాధులతో బాధపడుతున్న 1280 మందిని గుర్తించాం. వారిని ఏరియా ఆస్పత్రులకు, ఆరోగ్యశ్రీ విభాగానికి రిఫర్ చేశాం.

–డాక్టర్ హేమంత్, డీఎంహెచ్‌ఓ

ఎక్కువగా కీళ్ల నొప్పుల వారే..

దీర్ఘకాలిక ఆర్థోపెడిక్ సమస్యలున్నవారని ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశాం. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు వచ్చే రోగుల్లో ఆర్థోపెడిక్‌కు సంబంధించి కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు, వాతం నొప్పులున్నవారే ఎక్కువగా వస్తున్నారు. వారికి మందులు అందజేశాం. ఎక్కువగా నొప్పితో బాధపడుతున్నవారిని ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశాం. మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నాం.

–డాక్టర్ మల్లికార్జున్, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి

మా ఊరికి వచ్చి వైద్యం అందించడం బాగుంది



నేను గుండె సమస్యతో బాధపడుతున్నాను. బీపీ, సుగర్ పరీక్షించారు. రక్తపరీక్షలు, ఈసీజీ కూడా చేశారు. కొన్ని మాత్రలు ఇచ్చారు. పెద్దాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడకు సోమవారం రమ్మని అన్నారు. మా ఊరు వచ్చి వైద్యం చేయడం చాలా బావుంది. –నిర్శోగి శంకర్రావు, వై.బి పట్నం

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



నాకు మా సచివాలయ ఏఎన్ఎం బీపీ, సుగర్ చెక్ చేస్తుంది. ఈరోజు నిర్వహించిన హెల్త్ క్యాంపులో డాక్టర్లు బీపీ, సుగర్ పరీక్షించి మందులు ఇచ్చారు. అంతేకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏమి తినాలో సూచనలు కూడా చేశారు. మాలాంటి వారికి అండగా ప్రభుత్వం నిలుస్తోంది.

– పండాడ రాజమ్మ, గన్నవరం గ్రామం

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

ఎస్పీ మురళీకృష్ణ



గంజాయి కేసులు, రౌడీషీటర్ల కేసులను సమీక్షించిన ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో నిందితుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. ప్రతి నెలా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని, వారి నడవడికపై ఆరా తీయాలని తెలిపారు. తీరు మారకుంటే పీడీ యాక్ట్ నమోదు తప్పదని హెచ్చరించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గంజాయి కేసులు, రౌడీ షీటర్లు, వివిధ కేసులపై శనివారం సమీక్షించి, అధికారులకు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, కోర్టులో నేరాభియోగపత్రాలు సమర్పించి నిందితులకు బెయిల్ రాకుండా చేయాలని ఆదేశించారు. బెయిల్‌పై ఉండి మళ్లీ నేరానికి పాల్పడితే బెయిల్ రద్దుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కేసులు త్వరితగతిన విచారణ జరిపేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ లను సంప్రదిస్తూ..నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. గంజాయి రవాణాను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, డైనమిక్ చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఎస్ఐలు ప్రసాద్, భీమరాజు, జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల నుంచి పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

'విశాఖ వందనం' ప్రచార రథం పరిశీలన



రథాన్ని పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రారంభించనున్న నేపథ్యంలో నాన్ పొలిటికల్ జేఏసీ స్వాగత ఏర్పాటు చేస్తోంది. 'విశాఖ వందనం' పేరిట ప్రచార రథం ప్రారంభించింది. ఈ రథాన్ని శనివారం ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పరిశీలించారు. ఆచార్య లజపతిరాయ్ పాల్గొన్నారు.

దసరా నాటికి సరికొత్త రూపం

- రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులతో అనకాపల్లికి మరింత శోభ
- పట్టణంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పర్యటన



గుండాలజంక్షన్ వద్ద జీవీఎంసీ కల్యాణమండపం స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

అనకాపల్లిటౌన్: పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, రోడ్డు విస్తరణ, మరమ్మతులను దసరానాటికి పూర్తి చేసి, అనకాపల్లికి కొత్త రూపం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. జోనల్ కార్యాలయం వద్ద గల కంపోస్టు యార్డును నెలరోజుల్లో తరలించనున్నట్టు చెప్పారు. జీవీఎంసీ విలీన గ్రామాలైన రాజుపాలెం నుంచి వల్లూరు వరకూ, పట్టణంలో పెరుగుబజార్ జంక్షన్ నుంచి గుండాల జంక్షన్ వరకూ జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.13 కోట్లతో రహదారులు, విద్యుత్‌లైట్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. గుండాల జంక్షన్ వద్ద జీవీఎంసీ కల్యాణమండపంలో రెండు చాంబర్లు నిర్మించి, కలెక్టర్, జేసీలు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నాణ్యతాప్రమాణాలతో జరిగే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనకాపల్లి వై.జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకూ చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు, ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు, విద్యుత్‌స్తంభాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. వై జంక్షన్‌లో ట్రీ గార్డ్‌లతో కూడిన ఆకర్షణీయమైన మొక్కలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. పూడిమడక జాతీయరహదారిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వేల్పులవీధి జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, ఈ సమస్య పరిష్కరించేందుకు వీలుగా రహదారిని విస్తరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ సుర వెంకటరమణ, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

నక్కపల్లి: స్థానిక 50 పడకల ఏరియా ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఓపీ విభాగం, ఫార్మసీ విభాగం, ఎక్స్‌రే ప్లాంటు, ఆపరేషన్ థియేటర్లు, స్టోర్ రూంలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం సకాలంలో అందించాలన్నారు. వార్డులు, మరుగుదొడ్లు ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీరు, వాడుక నీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

చెస్ చాంపియన్స్ ఆన్ష్, ప్రతీతి

ముగిసిన 36వ జాతీయ అండర్–11 చదరంగం చాంపియన్‌షిప్

విశాఖ స్పోర్ట్స్: 36వ జాతీయ అండర్–11 చదరంగం చాంపియన్‌షిప్‌ను ఓపెన్ బాలురలో ఆన్ష్ నందన్, బాలికల్లో ప్రతీతి సాధించారు. ఇక్కడి పోర్ట్ స్టేడియంలో శనివారంతో ముగిసిన 11 రౌండ్ల అనంతరం ఆన్ష్(మహారాష్ట్ర) పది పాయింట్లతో, ప్రతీతి(కర్నాటక) తొమ్మిదిన్నర పాయింట్లతో విజేతలుగా నిలిచారు. ఓపెన్‌లో తొమ్మిదేసి పాయింట్లతో ముగించిన సిద్ధాంత్, సయిద్(కర్ణాటక), మయూక్(పశ్చిమ బెంగాల్), ఆదిక్(కేరళ) టాప్ 5లో నిలిచారు. బాలికల్లో తొమ్మిది పాయింట్లతో సిద్ధి(కర్నాటక) రెండో స్థానంలో నిలవగా ఎనిమిదిన్నరేసి పాయింట్లతో ఏఎఫ్ఎం మైషా(మహారాష్ట్ర), పవిత్ర(తమిళనాడు), శరణ్య(తెలంగాణ) తర్వాత స్థానాలు సాధించారు. చివరిదైన 11వ రౌండ్‌లో ఓపెన్ టాప్ బోర్డ్‌పై ఆన్ష్ వేసిన ఎత్తులకు ఎ.ఆరవ్(తమిళనాడు) ఓటమి పాలవడంతో ఎనిమిదిన్నర పాయింట్లకే పరిమితమయ్యాడు. బాలికల టాప్ బోర్డ్‌పై చివరిదైన 11వ రౌండ్‌లో ప్రతీతి ఎత్తులకు చిత్తయిన ఆముక్త(ఆంధ్రప్రదేశ్) ఎనిమిది పాయింట్లతో టోర్నీకి ముగింపు పలికింది. ఆంధ్రా చెస్, ఆల్ విశాఖ చెస్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ చాంపియన్‌షిప్ నిర్వహించగా 27 రాష్ట్రాలకు చెందిన 385 మంది ఓపెన్ కేటగిరీలో పాల్గొన్నారు. వీరిలో 277 మంది ఫిడే రేటింగ్ చిన్నారులు పోటీపడ్డారు. బాలికల్లో 194 మంది పాల్గొనగా వీరిలో 91 మంది ఫిడే రేటింగ్ చిన్నారులున్నారు.

ఏపీ చిన్నారుల సత్తా

ఈ చాంపియన్‌షిప్‌లో మన రాష్ట్రానికి చెందిన చిన్నారులు సత్తా చాటారు. టోర్నీలో మొత్తంగా ఏపీకి చెందిన 42 మంది ఓపెన్, బాలికల విభాగాల్లో తలపడగా పలువురు టాప్‌లో నిలిచి నగదు ప్రోత్సాహకాలను సాధించారు. వీరిలో త్రిపురాంబిక 6వ స్థానంలో నిలిచి రూ.15వేలు, ఓపెన్‌లో అఖిల్ ప్రసాద్ 12వ స్థానంలో నిలిచి రూ.10వేలు అందుకున్నారు. చివరి రౌండ్‌లో సైతం టాప్ 10 బోర్డులపైనే ఏపీ చిన్నారులు పోటీపడ్డారు. వీరిలో శ్రావ్య శ్రీ 8వ స్థానంలో, టోర్నీ టాపర్‌గా బరిలోకి దిగిన ఆముక్త రెండు పరాజయాలతో 10వ స్థానంతో సరిపుచ్చింది. రిషిత 14, భవన్య 28వ స్థానానికి దిగజారారు. ఓపెన్‌లో శ్యామ్యూల్ 15, ఏపీ తరఫున టాపర్‌గా టోర్నీ ప్రారంభించిన హేమల్ వర్షణ్ 27వ స్థానంతో సరిపుచ్చారు.

వరల్డ్ అండర్–12కు విజేతలు

జాతీయ అండర్–11 చదరంగం చాంపియన్‌షిప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారిని ప్రపంచ అండర్–12 చెస్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఓపెన్‌లో ఆన్ష్ నందన్(మహారాష్ట్ర), సిద్ధాంత్(కర్నాటక), బాలికల్లో ప్రతీతి, సిద్ధి(కర్నాటక) తొలి రెండు స్థానాల్లో నిలిచిన సంగతి తెలిసిందే.

రూ.లక్ష ప్రోత్సాహం.. ఊహించలేదు



జాతీయ చెస్ పోటీల్లో టాప్ బోర్డులపై ఆడటం సంతోషంగా ఉంది. టోర్నీని 13వ ర్యాంక్‌తో ఆరంభించి 6వ స్థానంతో ముగించడం చాలా ఆనందాన్నిచ్చింది. 11 రౌండ్లలో చివరి ఎనిమిది రౌండ్‌లు టాప్ 10 బోర్డులపైనే ఆడటం.. మొదటి తొమ్మిది రౌండ్లలో పరాజయం లేకుండా ముందుకు సాగడం ద్వారానే ఇది సాధ్యపడింది. చివరి ఏడు రౌండ్లు టాప్–3 బోర్డుల్లోనే ఆడాను. నా ఫిడే రేటింగ్ 1,342. ఈ టోర్నీలో 8 పాయింట్లు సాధించాను. టోర్నీ ద్వారా రూ.15వేలు అందుకున్నాను. టోర్నీ విజేతకు రూ.70 వేలు అందించారు. అలాంటిది మన రాష్ట్ర ప్రభుత్వం నాకు లక్ష రూపాయలను ప్రోత్సాహకంగా అందించడం నేను ఊహించలేదు. భవిష్యత్ టోర్నీల్లో మరింత మెరుగైన ఆటను ప్రదర్శిస్తాను.

–త్రిపురాంబిక, 6వ ర్యాంకర్

భవిష్యత్ టోర్నీలో మరింతగా రాణిస్తా..



చాంపియన్‌షిప్‌లో 21వ ర్యాంక్‌తో 1,553 ఫిడే రేటింగ్‌తో తొలి ఎత్తును డిఫెండ్ చేసుకునేందుకు నల్ల పావులతోనే ప్రారంభించి విజయం సాధించాను. చివరికి 12వ ర్యాంక్‌తో ముగించడం చాలా సంతోషాన్నిచ్చింది. రెండో ర్యాంకర్ సీఎం వివాన్‌పై విజయం సాధించడం మరిచిపోలేను. టోర్నీ మొత్తంలో ఆరవ్ చేతిలో పరాజయం పాలయ్యాను. ఆట ద్వారా రూ.10 వేలు అందుకోగా.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.లక్ష రూపాయలు అందించారు. ఆటను మరింత మెరుగుపరచుకుని.. భవిష్యత్ టోర్నీలో రాణించేందుకు కృషి చేస్తాను.

– అఖిల ప్రసాద్, 12వ ర్యాంకర్

జోనల్ కార్యాలయంలో ఆహా క్యాంటీన్

- మెప్మా సంఘాల ఆధ్వర్యంలో తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం
- ప్రారంభించిన జీవీఎంసీ కమిషనర్



జోనల్ కార్యాలయంలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

అనకాపల్లి టౌన్: మెప్మా సంఘాల ద్వారా నాణ్యమైన భోజనం తక్కువ ధరలకే అందిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్‌వర్మ అన్నారు. జోనల్ కార్యాలయంలో 'ఆహా క్యాంటీన్' క్యాంటీన్ నిర్వాహకురాలు వెచ్చా రమణితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ పట్టణంలో మహిళా సంఘాల ద్వారా పరిశుభ్రమైన, రుచిగా చౌక ధరలకు ఆహారం అందించడానికి ఆహా క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, ఆహా క్యాంటీన్‌లో ఇడ్లీ, దోస, బోండా, గారె, ఉప్మా, పులిహోర, దద్దోజనం, వెజిటబుల్ పులావ్, ఇతర కూరలు తక్కువ ధరలకు ప్రజలకు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. జోన్ కార్యాలయంలో యూడీసీ విభాగంతో మహిళా సంఘాల ద్వారా ఆహా క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జగనన్న ఆసరా, చేదోడు లబ్ధిపొందిన మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, ఆహా క్యాంటీన్‌లను రాష్ట్రంలో అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో 11 క్యాంటీన్‌లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా ప్రస్తుతం 7జోన్‌ల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జెడ్సీ వెంకటరమణ, ఏపీడీ డి.కె.దొర, డీఆర్‌పీ బాలశేఖర్ పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగిపై రౌడీ షీట్

డీఎస్పీ సుబ్బరాజు



రావికమతంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు

రావికమతం: పోలీసులపై పలుమార్లు తిరగబడి గాయాల పాల్జేసిన మండలంలోని మేడివాడకు చెందిన ఆర్మీ ఉద్యోగి గొర్లె భాస్కరరావుపై రౌడీషీట్ తెరుస్తామని అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు. శనివారం రావికమతంలో ఆయన మాట్లాడారు. పంజాబ్ రాష్ట్రం పటాన్‌కోట వద్ద హవాల్దార్‌గా పనిచేస్తున్న భాస్కరరావు సెలవుపై స్వగ్రామానికి వచ్చాడన్నారు. గ్రామంలోని భూతగాదాలో గతంలో అతడిపై రెండు కేసులున్నాయన్నారు. అప్పట్లో జైలుకు వెళ్లాడన్నారు. తాజాగా భూతగాదాలో ప్రత్యర్థులను కత్తులతో బెదిరిస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లిన ఎస్ఐతోపాటు, ఏఎస్ఐ అప్పారావు, సిబ్బందిలపై దాడికి పాల్పడ్డారన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. గతంలోనూ ఇప్పుడు ఐదు కేసులున్న నిందితుడిపై రౌడీషీట్ తెరవాలని ఎస్ఐ ప్రతిపాదన మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బాలకిషోర్

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు పండ్ల దుకాణంలో విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రికి సమీపంలో కానూరు గ్రామానికి చెందిన కనూరి బాలకిషోర్(19) దుకాణంలో స్విచ్ ఆన్ చేయగా విద్యుత్ షాక్ తగిలింది. కుటుంబ సభ్యులు అతనిని 108లో నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలకిషోర్ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు రెండు నెలలు క్రితం పండ్ల వ్యాపారం నిమిత్తం అడ్డురోడ్డు వచ్చినట్టు చెప్పారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. • ఈ నెల 9 నుంచి 15 వరకు రాజమండ్రి – విశాఖపట్నం – రాజమండ్రి (07466/07467) పాసింజర్ స్పెషల్ రద్దు. • ఈ నెల 9 నుంచి 15 వరకు గుంటూరు – విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 10 నుంచి 16 వరకు విశాఖపట్నం – గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 9, 10, 11, 13, 14న విశాఖపట్నం – విజయవాడ – విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 9 నుంచి 15 వరకు మచిలీపట్నం – విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 10 నుంచి 16 వరకు విశాఖపట్నం – మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్ రద్దు.

పలు రైళ్ల దారి మళ్లింపు

రెగ్యులర్ మార్గం నిడదవోలు – ఏలూరు – విజయవాడ మీదుగా కాకుండా నిడదవోలు – భీమవరం టౌన్ – గుడివాడ – విజయవాడ మీదుగా రైళ్ల నడుస్తాయని, ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు.

వరహానదిలో పడి ఒకరి మృతి

ఎస్.రాయవరం: పి.ధర్మవరం సమీపంలో వరహానదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. పి.ధర్మవరం గ్రామానికి చెందిన తీరం నాగేశ్వరరావు(50) శుక్రవారం నది వైపు వెళ్లి కాలుజారి పడిపోయాడు. బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కోసం కుటుంబ సభ్యులు గాలించగా శనివారం నదిలో శవమై తేలినట్టు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రైస్ మిల్లు ప్రమాద ఘటనలో ఇద్దరి అరెస్టు



మిల్లులో వివరాలు నమోదు చేస్తున్న పోలీసు

పాయకరావుపేట: స్థానిక జాతీయ రహదారి సమీపాన పీఎల్‌పురంలో అగ్ని ప్రమాదానికి గురైన బాబుఫుడ్ రైస్ మిల్లు ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ బి.జోగారావు శనివారం తెలిపారు. గత నెల 23న తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఇక్కడ రైస్ మిల్లులో విలువైన సామగ్రి, బియ్యం కాలిపోయాయన్నారు. మిల్లు యజమాని చింతల శేఖర్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ఈ ప్రమాదానికి కారకులైన ఎస్.రాయవరం మండలం బొజ్జ చంద్రశేఖర్, కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన కరణం శివలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వరకట్న వేధింపులతోనే వివాహిత బలి

కేసు దర్యాప్తులో పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ షేక్ గఫూర్



మృతురాలి భర్త శశికాంత్‌ను విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ షేక్ గఫూర్

యలమంచిలి: వరకట్న వేధింపులే వివాహితను బలి తీసుకున్నాయి. వివాహ సమయంలో ఇచ్చిన రూ.10 లక్షలు, ఇతర కట్న కానుకలు చాలవంటూ మృతురాలి భర్త తాజాగా కారును కానుకగా తేవాలని వేధించి మానసికంగా హింసించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని పరవాడ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ షేక్ గఫూర్ నిర్ధారించారు. శుక్రవారం యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారిలో పెట్రోల్ బంకుకు ఎదురుగా ఉన్న ఇంట్లో సాయివిమల (25) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై అదే రోజు రాత్రి మృతురాలి తండ్రి అంగాన శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శనివారం డీఎస్పీ, సీఐ విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నిందితుడు శశికాంత్‌పై 304బీ చట్టం ప్రకారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో కుటుంబ సభ్యుల ప్రమేయం ఏమైనా ఉందా లేదా అని విచారణ చేపడుతున్నామని సీఐ తెలిపారు. పెళ్లయిన రెండేళ్లలోపే తమ కూతురును పొట్టన పెట్టుకున్నాడంటూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా రోదించారు.

క్లుప్తంగా

గవరపేట వీధి అభివృద్ధికి చర్యలు



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తుమ్మపాల సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి రూరల్: తుమ్మపాల గవరపేట వీధి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు తెలిపారు. శనివారం గవరపేట వీధిని వార్డు సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. శిథిలమైన మరుగుదొడ్లను పరిశీలించి, పురుషులు,మహిళలకు వేర్వేరుగా ఉపయోగపడేలా కొత్తవాటిని నిర్మిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం తుప్పలు,చెత్త,వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చదరం చిన్న,వార్డు సభ్యులు వెలగా మోదినాయుడు,తర సత్యారావు,స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను పాల్గొన్నారు.

12న మరిడిమాంబ ఉత్సవం



కన్నూరుపాలెంలో ఏర్పాటు చేసిన మరిడమ్మను కొలువు ఉంచిన శాల

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో ఈ నెల 12న మరిడిమాంబ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉత్సవానికి వారం రోజుల ముందు అమ్మ వారి పుట్టుక పురస్కరించుకుని అక్కడి సచివాలయం వద్ద తాటి ఆకులతో శాల ఏర్పాటు చేసి, సంప్రదాయంగా అమ్మ వారిని నెలకొల్పి పూజలు నిర్వహిస్తున్నారు. రోజూ గ్రామంలో ఘటాలను ఊరేగిస్తున్నారు.

కార్మిక సంఘ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తుమ్మపాల:పట్టణంలో ఎన్టీఆర్ మార్కెట్‌లో గాంధీ మార్కెట్ కార్మిక సంఘం సభ్యుడు ఆళ్ళ బలరాం మరణంపై కార్మిక సంఘాల సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘంలో అతడి షేర్‌ధనంతో పాటు అదనపు సాయం కలిపి మొత్తం రూ.33,772 చెక్కును సొసైటీ చైర్మన్ పాలిమేర శివఅప్పారావు, డైరెక్టర్ పి.వెంకటి కుటుంబసభ్యులకు అందజేశారు.

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
మంత్ ఆఫ్ మధు	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 600 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
మొదటి రకం	4,540	4,560
రెండో రకం	3,980	4,260
మూడో రకం	3,910	4,220

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-12 యూనిట్లు, బి పాజిటివ్-10 యూనిట్లు, ఒ పాజిటివ్-13 యూనిట్లు, ఒ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(ఫోన్ నంబర్ 97036 19706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 374 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 348 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు వెల్లువలా..



శిబిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యురాలు గ్రేస్ కేథరిన్



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ శివకుమార్




డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న ప్రజలు

కశింకోట: స్థానిక 3వ సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ప్రజలు వెల్లువలా వచ్చి, వైద్య సేవలు పొందారు. డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ శిబిరంలో 514 మందికి వైద్య సేవలందించారు. అత్యధికంగా 94 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఐదుగురిని శస్త్రచికిత్సలకు, 46 మందికి కళ్లద్దాలకు సిఫారసు చేశారు. 28 మందికి ఈసీజీ తీశారు. 15 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. సుగర్, బీపీ, రక్త శాతం, మలేరియా, డెంగ్యూ, యూరిన్, కఫం వంటి పరీక్షలు చేశారు. ప్రత్యేక వైద్యులు గ్రేసీ కేథరిన్, కె.సునిల్, వై.యశోద, యు.రమేష్ వైద్య సేవలందించారు. ఆప్తాలమిక్ శివకుమార్ కంటి రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. స్పాట్ రిజిస్ట్రేషన్, ఇంటింటి సర్వేలో ఎంపిక చేసిన వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేశారు. రక్త పరీక్షలు నిర్వహణకు, మందుల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బంది నియమించి, సౌకర్యాలు కల్పించారు. ఎంపీపీ కలగా లక్ష్మి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యాన్ని అందించడానికి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది రకాలైన పరీక్షలు జరుపుతున్నట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శిబిరాన్ని సందర్శించారు.మండల ప్రత్యేక అధికారి రోజారాణి, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న అంగన్‌వాడీల ప్రదర్శన





కశింకోటలో పౌష్టికాహార ప్రదర్శన (ఇన్‌సెట్) అందంగా తీర్చిదిద్దిన ఐసీడీఎస్ చిహ్నం

కశింకోట: ఇక్కడ నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వివిధ రకాల పౌష్టిక ఆహార పదార్థాలు, జగనన్న సంపూర్ణ పోషణ కిట్, ఆరోగ్యాన్నిచ్చే పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, కోడి గుడ్లను ప్రదర్శించారు. వాటి ప్రాధాన్యతను గర్భిణులు, బాలింతలు, ప్రజలకు వివరించి, అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ చిహ్నాన్ని ఆకులు, పూలు, ముగ్గుతో అందంగా వేశారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.మహేశ్వరి తయారు చేసిన తెలుగు అక్షర మాలను చార్టులను ప్రదర్శించారు. అందరినీ ఆకట్టుకున్నాయి

ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తానన్నారు



జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి పరీక్షలు చేశారు. కంటి శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు. నెల రోజులపాటు వాడాలని మందులు ఇచ్చారు. తర్వాత ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామన్నారు. ఆనందంగా ఉంది. -గొర్లి మంగయమ్మ, కశింకోట

నడుం, కాళ్ల నొప్పులు



చాలా కాలం నుంచి నడుం, కాళ్ల నొప్పితో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య శిబిరంలో పరీక్షించి నొప్పులు తగ్గడానికి మందులు ఇచ్చారు. -పాలమరశెట్టి నాగమణి, కశింకోట

మాటలు సరిగా రావడం లేదు



ఈ చిత్రంలో ఐదేళ్ల బాలిక పేరు మొల్లి నీహారిక. కశింకోటకు చెందిన ఈమెకు మాటలు సరిగా రావడం లేదు. జగనన్న ఆరోగ్య శిబిరానికి ఆమె తల్లి తీసుకొచ్చింది. వైద్యులు క్షుణ్ణంగా పరీక్షించి మందులు అందజేశారు. దీంతో ఆ తల్లి ఆనందం వ్యక్తం చేసింది.

పలు ప్రాంతాల్లో అన్నసమారాధనలు



విఘ్నేశ్వరుని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్, పీలా లక్ష్మి సౌజన్య

తుమ్మపాల: మండలంలోని వెంకుపాలెం, బీఆర్‌టీ కాలనీ, పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధిలో ఏర్పాటుచేసిన నవరాత్రి మండపాలల్లో వినాయక విగ్రహాలను శనివారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా వాడవాడలా గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేసి, నిత్యపూజలు చేయడంతో పాటు అన్న సమారాధనలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య, రాంబాబు, బుద్ధ శివనాయుడు, బొడ్డపాటి చినరాజారావు, పీఎస్కే నాయుడు, శిలపరశెట్టి బాబీ పాల్గొన్నారు.

ఎస్ఆర్ శంకరన్‌కు ఘన నివాళి



ఎస్ఆర్ శంకరన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి రూరల్: విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఆర్ శంకరన్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా గౌరవాధ్యక్షుడు దొరబాబు,వియ్యపు రాజు,నరాల శెట్టి సత్యనారాయణ,కోన లక్ష్మణ,కొల్లి సత్యారావు,వియ్యపు రమణ,సంతోష్, సత్తిబాబు,నాయుడు,పవన్,జానీ,నాగేష్ పాల్గొన్నారు.

తెలుగు పద్యాలు నేర్చుకోండి



సదస్సులో మాట్లాడుతున్న కె.రామమోహన్‌రావు

అచ్యుతాపురం(అనకాపల్లి): తెలుగు భాష నిర్లక్ష్యానికి గురి కాకుండా అందరూ తెలుగుని ప్రోత్సాహించాలని అనకాపల్లి జిల్లా తెలుగు పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రామమోహన్‌రావు కోరారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం , కొండకర్లలో శనివారం తెలుగుకు వెలుగు నిద్దాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్‌రావు మాట్లాడుతూ తెలుగు చదవడం, రాయడం , మంచి పుస్తకాలు చదవడం వంటి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. విశ్రాంత ఎంఈవో శిష్టా తమ్మిరాజు మాట్లాడుతూ శతక పద్యాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, పద్యాలు చదవాలని కోరారు. కథా రచయిత రంగబాబు మాట్లాడుతూ చిన్న చిన్న కథలను చదవాలన్నారు. కార్యక్రమంలో హరిపాలెం హెచ్‌ఎం రవి, కొండకర్ల హెచ్‌ఎం సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువతో ఆసరా



బి.కె.పల్లిలో జగనన్న పాలవెల్లువను ప్రారంభిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: బి.కె.పల్లిలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మాజీ ఉప సర్పంచ్ పెట్ల రాంబాబు పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోరి సీఎం జగన్ అమూల్ డెయిరీతో ఒప్పందం చేశారన్నారు. అమూల్ కంపెనీ పాడి రైతులకు అధిక ధరను చెల్లిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



దుకాణదారులతో మాట్లాడుతున్న అచ్యుతాపురం పోలీసులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అన్ని వ్యాపార సంస్థల సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ మురళీరావు సూచించారు. శనివారం మండలంలోని వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారి కనిపించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితుల కదలికలను గుర్తించి పోలీసులకు తెలపాలని కోరారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి పది గంటల లోపే దుకాణాలను మూసి వేయాలని, బంగారు దుకాణాలు,షాపింగ్ మాల్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్స్‌ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లాడ్జీలను తనిఖీ చేశారు. ఎస్ఐ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

వచ్చే నెలలో సాంస్కృతిక సమ్మేళనం



శ్రీకృష్ణ ఆలయంలో సమావేశమైన ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం (అనకాపల్లి): వచ్చే నెలలో హిందూ ధర్మం, కళలను ప్రదర్శించే వారందరినీ ఒక చోటకి చేర్చి సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తామని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని శ్రీకృష్ణ, ఆంజనేయ స్వామి దేవాయలంలో శనివారం నిర్వహించిన సమరసతా సేవా ఫౌండేషన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంస్కృతిక సమ్మేళనంలో కళాకారులను సత్కరించుకుందామని తెలిపారు. ఈనెల 14న సత్సంగం, 20న సరస్వతీ పూజ, 23న విజయదశమి నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. పౌర్ణమి రోజున సామూహిక హారతి నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ మండల కన్వీనర్ గుడివాడ రమణ, కో-కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు, ఆడారి త్రినాథ్, చోడపల్లి సత్యం, కూండ్రపు రమణ, బంటు రాము, మేరుగు రాజారావు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- పేదల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి
- ఎంపీపీ గొర్లి సూరిబాబు
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు భారీగా తరలివచ్చిన ప్రజలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల: వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. అందరికీ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జగన్నన ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలో రేబాక పంచాయతీ గురజాడనగర్‌లో సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని నియమించి నిత్యం ప్రజలకు వైద్యసేవలందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో నిపుణులైన వైద్యులతో రోగులకు సేవలందిస్తున్నట్టు తెలిపారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు సేకరించిన వివరాల ఆధారంగా భవిష్యత్తులో కూడా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా లభ్యమయ్యే సేవలు, ఆస్పత్రుల వివరాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. పౌష్టికాహార పథకం స్టాల్‌ను సందర్శించి అంగన్‌వాడీలను అభినందించారు. సర్పంచ్, ఎంపీటీసీ, పలువురి నాయకులతో పాటు గ్రామంలో 250 మంది ప్రజలు తరలి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హేమంత్, ఎంపీడీవో నరసింగరావు, ఈవోఆర్‌డీ ధర్మారావు, వైద్యులు సమీమ్, వాణి, ఎంపీటీసీ మంత్రి సత్తిబాబు, మార్టూరు భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, వైస్‌సర్పంచ్ రామకృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్ర కీలకం



ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్ : ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని, మరింత ఎక్కువ మంది మహిళలను ప్రకృతి సాగులో భాగస్వాములయ్యేలా చూడాలని అనకాపల్లి ప్రాంతీయ ప్రకృతి వ్యవసాయాధికారి హేమసుందర్ అన్నారు. శనివారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచడం, నేల ఆరోగ్యం పెంపుదలకు నవధాన్యాల సాగును ప్రోత్సహించడం, ఏడాది పొడవునా బహుళ పంటల సాగును చేపట్టడం, పెరటి తోటల పెంపకం విధానం, దాని వల్ల కలిగే లాభాలు తదితర విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వనరుల కేంద్రం ద్వారా ఏపీ ప్రభుత్వం ప్రకృతి సాగును ప్రోత్సహించడంకోసం ఇస్తున్న రాయితీల గురించి తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు సాధికార సంస్థను ఏర్పాటు చేసి జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రకృతి వ్యవసాయ మేనేజర్ స్వామి నాయుడు, పలువురు అధికారులు,మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భయం వీడితేనే ఉపన్యాస కళలో రాణింపు



విద్యార్థులతో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

కశింకోట: విద్యార్థుల్లో ప్రసంగ పాటవం(స్పీచ్ కాంపిటెన్సీ) పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సూచించారు. విద్యార్థుల్లో ప్రసంగ పాటవం పెంపొందించేందుకు కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఇంటర్నల్ క్లబ్ దత్తత తీసుకుంది. ఆ బృందం శనివారం పాఠశాలను సందర్శించింది. ఈ బృందంతోపాటు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా పూర్తిగా ఆంగ్లంలో మాట్లాడటంతో పాటు అందుకు అనుగుణంగా బాడీ లాంగ్వేజ్ ఉండేలా ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడించారు. స్పీచ్ కాంపిటెన్సీ అన్ని స్కూళ్లలో చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు కృష్ణ, వారణాసి వెంకట నరసింహమూర్తిలు విద్యార్థులకు స్పీచ్ కాంపిటెన్సీపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మూర్తి, హెచ్‌ఎం ఎం.ఆర్.వి. అప్పారావు, ఉపాధ్యాయులు ఆచంట రవి, భీశెట్టి ఆనంద్, ప్రభాకర్, బొడ్డెడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు

అనకాపల్లిటౌన్: స్థానిక డైట్ కళాశాల ఆవరణలో ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈఈఈ విభాగం విద్యార్థులకు ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్‌పై వారంరోజుల పాటు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ఈవర్క్‌షాప్ 3వ సంవత్సరం ఈసీఈ, ఈఈఈ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని, దీని ద్వారా మంచి ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు పి.పూర్ణప్రియ, ఎ.ఎస్.ఎల్.కె.గోపాలమ్మ,ఎస్.సరితారాణి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు నలుగురు విద్యార్థినుల ఎంపిక



రన్నింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ శ్రీనివాస్



హైజంప్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మండలం నుంచి నలుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్టు పీడీలు శ్రీనివాసరావు, నిర్మల తెలిపారు. శుక్రవారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగిన పోటీల్లో అండర్ 17 విభాగంలో ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు 1500 మీటర్ల పరుగు పందెంలో టి.ఎన్.వి.దుర్గ, 3000 మీటర్ల పరుగు పందెంలో కె.కావ్య ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. వీరివురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 17లో ప్రగడ మాధురి హైజంప్‌లో ప్రథమ స్థానం, అండర్ 14 విభాగంలో రాయవరపు కీర్తి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ నిర్మల తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

మునగపాక : ప్రకృతి వ్యవసాయం ద్వారా మేలు జరుగుతుందని గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు అన్నారు. గణపర్తిలో శనివారం రైతులతో కలిసి జిల్లేడు కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ విధానం ద్వారా పంటల సాగు శ్రేయస్కరమన్నారు. అనకాపల్లి జిల్లా డీపీఎం లచ్చన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దలు వెలగా దారనాయుడు, వెలగా జగ్గారావు పాల్గొన్నారు.

మెలిపాకలో జంగిల్ క్లియరెన్స్

మునగపాక : మండలంలోని మెలిపాకలో రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులు శనివారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి దుర్గ, వార్డు సభ్యుడు గుల్ల అమర వెంకట సత్యనారాయణలు పర్యవేక్షించారు. రహదారికి ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఈ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అలాగే అరబుపాలెంలో తుప్పలు పేరుకుపోవడంతో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు శనివారం రహదారికి ఇరువైపులా గడ్డిమందు పిచికారీ చేయించారు.